# డోనా పౌలా

వీడ్కోలు చెప్తూ ఒక మిత్రుడు చమత్కరించాడు– "గోవా వెళ్తున్నావు – బాగా కోవా తింటావు. అదృష్టవంతుడివి." ముత్యాలరావు సరిహద్దు స్టేషను 'కేజిల్ రాక్' నుంచి యే అమ్మాయి తన కళ్లల్లోనికి చూస్తుంది – యెలా ఆ ముత్యాల్లాంటి పళ్లతో నగవు వెదజల్లి గేలం వేద్దామని చూస్తున్నాడు.

అమ్మాయిల బదులు అడవి యెదురైంది. పచ్చని అడవి పరుగెత్తుతూ అక్కడక్కడా పూలవనాన్ని చూడడానికి ఆగిపోతోంది. దబదబా డప్పులా శబ్దం చేస్తున్న వర్షం చప్పున ఆగిపోతే కిటికీ యెత్తిచూసాడు. కొండమీద పడ్డ వర్షం మలినంలేని జలపాతమై "దూద్‌సాగర్"గా మెరసి లోయలోనికి పురుకుతోంది. రంగులను మార్చుకుంటూ కదలిన మన్ను మైదాపిండిలా మారి గోవా మత్స్యకన్యలానున్న సాగరం మెడలో ఒక ముత్యాలహారంలా పట్టి వుంది. దగ్గరలోనే కప్పల్లాంటి బావులను సహిస్తూ పాముల్లా నదులు జారుతూ పోతున్నాయ్. మెరుపులు ఆకాశాన్నంతా వెలిగించినా పురుములు చెవులను చిల్లులను చెయ్యటం లేదు. ఇక్కడ కొండలూ, కనుమలూ, నదులూ, సాగరం, అడవులూ, తోటలూ, హద్దుమీరి పెరగలేదు. అందుకే అందంగా కనిపిస్తున్నాయ్. వీటి పరిసరాల్లో పెరిగిన ఆడది అంత అందంగానూ వుంటుందిగానీ హద్దులకు కట్టుబడి వుండదనుకున్నాడు. ప్రకృతి సంగీతం విని తనే గిటారు వాయిస్తున్నా ననుకున్నాడు. ప్రకృతే అమ్మాయిగా మారి ఒక ఫ్లయింగ్ కిస్ యిస్తున్నట్లు ఫీలయ్యాడు.

గోవా చేరిన మరుక్షణం నించీ ఆ 'ఫ్లయింగ్ కిస్' ఓ అమ్మాయి యిస్తే వచ్చే పులకరింపు కోసం రావు తహతహలాడుతూ తిరిగాడు. 'వాస్కో' లో ముందు బేంకుకు వెళ్లాడు. కౌంటరులో నున్న అమ్మాయి మగవాడి మనసును పట్టిలాగేటట్లు అందాన్ని చూపించే డ్రెస్ వేసుకుంది. దరహాసం కలుపుతూ మాటాడుతున్నా తన కళ్లల్లోనికి నిదానించి చూడటం లేదు. చేపల బజారుకు వెళ్లాడు. చేపలమ్మే "బాబీ"ల కప్పని అందం అన్నికోణాలనించీ చూసాడు. అటునించి వెర్రిచూపుల్లేవు. మోటారు సైకిలు వెనుక కూర్చున్న అమ్మాయి రైడరు ప్రియురాలనుకున్నాడు. కాదు. అంత వయ్యారం వళ్లగబోసుకుని కూర్చున్న అమ్మాయిని భద్రంగా రాత్రిమీద నివాసం చేర్చి తన అద్దె డబ్బు అందుకున్నాడు యువకుడు. తనకు యింత వెర్రెత్తిస్తున్నా యిక్కడ యువకులు ఆ అమ్మాయిలకు అల్లరిపెట్టడం లేదెందుచేత? వర్షం. వచ్చిన మూడు నెలల నించీ తెరిపిలేని వర్షం. విసిగెత్తి ఒక బార్ లో దూరాడు. అక్కడక్కడ

జోడీలు, ఒంటరిగా వున్న ఆడవాళ్లూ వున్నారు. కూరలమ్మే అమ్మాయి కుళ్లిపోతే కాయగూరలు పడేస్తుంది గానీ బేరం లేదు. రాత్రి ఎనిమిదైతే అదరా బాదరాగా కొట్లు మూసేస్తారు. వయసు ముదురుతున్నా ఒంటరిగా బార్‌లో కూర్చున్న అమ్మాయిలకు కోరికలు ముదరనట్లుంది. తను కళ్లను ఆకర్షించే హంగులన్నీ బాహాటంగా వదిలేసిన అతివ, పొరపాటునైనా తన కళ్లల్లోనికి నిదానించి చూడటంలేదు. చలి వెయ్యకపోయినా వెచ్చదనంకోసం తహతహలాడించే వాతావరణం. ఆకాశంలో ఒక చుక్కయినా మెరవటం లేదు. వర్షం... వర్షం... బురద గుంటలను సృష్టించని వర్షం. ఎర్రమట్టినించి పచ్చదనాన్ని పుట్టించిన వర్షం. పిడుగులైనా పడటం లేదు. తేనె వాసన వేస్తోందని పెగ్ మీద పెగ్ 'కేజూఫెనీ' సేవిస్తే అది పెద్ద కిక్కే యిచ్చింది. తనకన్నా హెచ్చు తాగిన ఆడవాళ్లుకూడా యే వికారం పొందకుండా నెమ్మదిగా గోవులా కదలిపోయారుగానీ తను గుర్రంలా గెంతుతూ వీధిలో పడ్డాడు.

ఈ గుర్రపు పరుగు ఆగలేదు. పరుగును ఆపించే అతివా తారసపడలేదు. కొండల్లో వర్షం లోయల్లోనికి జారి బావులను సృష్టించి కూర్చోలేదు. ఆ బావుల్లో కలువ పువ్వులు కుప్పలు కుప్పలుగా విడివడ్డాయి. నారియాల్ పౌర్ణమి నించీ ఆకాశంలో చుక్కలు చెదురు చెదురుగా కనిపించాయ్. దబోలిమ్ విమానాశ్రయంలో యింతవరకూ కనిపించని హిప్పీలు కనిపించారు. కెరటాలపై నురగ తగ్గింది. వెలుగులో చేపల పడవలు పరుగెత్తాయి. గోవా గురించి చెప్పినదానితోపాటు చెప్పని విషయాలెన్నో కనిపించడం మొదలుపెట్టాయి. కొత్తపెళ్లంతో కొన్నాళ్లు కాపరం చేసాక రానురాను అర్థం చేసుకున్నట్లు తొలిరోజుల్లో గోవా గురించి పడ్డ విసుగు రాను రాను తగ్గిపోయింది. బస్సులో కార్నర్ సీటులో కూర్చొని వాస్కోనించి కోటాలి వేపు వెళ్తుంటే జొరీనది సంగమంలో ఓడల మరమ్మత్తు చేసే కంపెనీలో పని మొదలుపెట్టారు. ఇరువైపుల వున్న కొబ్బరిచెట్లు. అక్కడక్కడ కొబ్బరి తోటల మధ్యలో నీటైన యిల్లు. వర్షాకాలం అయిపోయిందని కామోసు రంగులు, వెల్లలూ పూసుకుంటున్నాయి. అప్పుడే వరిచేలు కోస్తున్నారు. కొన్నిచోట్ల కోసిన చేలను కర్రలతో బాది పూడ్చుతున్నారు. అక్కడక్కడ చెట్లపై కోతులు. చెట్టుక్రింద మంగలి క్షౌరం చేస్తున్నాడు. ప్రతి యింటి చుట్టూ పూలమొక్కలు. తీరాన్ని అంటుకున్న ప్రకృతి నవ్వుతోంది. ప్రజ కదలుతున్నారు. నది మధ్యలో గుట్టమీద ఒక చర్చి. పడవల మీద చర్చికి వెళ్తున్నారు. కాలవమధ్యలో ఒక స్తంభం. ఆ స్తంభంమీద క్రాసు. ఈ శిలువలను యిల్లలోనూ, రోడ్లమీదా, సముద్రతీరాల్లోనూ, గుట్టలమీదా-యిక్కడా అక్కడా కాదు-ఎన్నోచోట్ల చూశాడు. అలాగే యిక్కడ దేవాలయాలకు కొదువలేదు. కాలుతీస్తే కాఫీహోటల్ లేదుగానీ కల్లుకొట్టు వుంది. బహుశః దేముడంటే భయమో లేక పోర్చుగీసు పాలనలో కఠిన దండన విధానమో లేక యీ కల్లుకొట్లో వీళ్లని శాసనధిక్కారం చెయ్యనివ్వటం లేదేమో లేక ఈ ప్రకృతి అందంలో ఆశల అంతరం చూసుకుని యిక్కడవాళ్లు మురిసిపోతున్నారా? అందుకే యిక్కడ దొంగతనాలు లేవు. అలజడి లేదు. ఆవేశాలు లేవు. ఆశలు లేవు. బేరం లేదు. సమ్మెలు లేవు. మార్పు లేదు! మనస్సాక్షిగా మెసిలే తత్వం అలవడిపోయినట్లుంది – అమ్మాయిలలో కూడా! తను ఏదో పరాయి దేశంలో వున్నట్లు ఫీలవుతున్నాడు.

వర్షాలలో అగపడని సూర్యుడు యీ అక్టోబరులో అతి త్రీవంగా వున్నాడు. నీలి సముద్రం నించి, పచ్చని చెట్లని తాకి వీచేగాలి చెమటపట్టకుండా చేస్తోంది. రావు డోనా పౌలా చేరుకునేసరికి పొద్దు పడుమటికి వాలిపోయింది. డోనా పౌలా అఖాతంపైనున్న అతి సుందరమైన స్థలం. పడవలు నిలిచే స్థలంనించి యెదరగా అఖాతం అయి చివరనున్న మార్మగోవా హార్బరు చూసాడు. బోటుక్లబ్బు పడవలు నీలితెర లెత్తుకుని యింకా తిరుగుతున్నాయ్. ఒక బోటులో యువకుడు కబీర్ బేడీలా వున్నాడు. అమ్మాయి పర్వీన్ బాబీలా వుంది. యెవరైనా హిప్పీ అమ్మాయి కనిపిస్తుందేమోనని కలియజూసాడు. కుడివేపు గుట్టపై కట్టిన స్తంభాల మహల్ పూతీవల మధ్యనించి ఒక ముఖం కనిపించింది. గబగబ పైకెగ్రబాకాడు. అతను వెళ్లేసరికి అమ్మాయి అక్కడ లేదు. అరేబియా సముద్రం వేపు దృష్టి సారిస్తున్న యింకో హిప్పీ మగాడి దగ్గర నిల్చుంది. అక్కడ వున్న భారతీయ టూరిస్టుల దృష్టులన్నీ వాళ్లపైనే కేంద్రీకరించి వున్నాయి. ఎలా విడగొట్టడం వీళ్లని? ఇద్దరూ ఖద్దరు వస్త్రాలతో వున్నారు. ప్రకృతి అందం వదలినట్లు ఆ అమ్మాయి సిల్కులాంటి జుత్తుతో విడిచిపెట్టిన అందం యెన్నో కళ్లను కేంద్రీకరింపజేస్తోంది. కొంతసేపయ్యాక యిద్దరిలో యేదో జగడం వచ్చినట్లుంది. వాడు గబగబ మెట్లు దిగిపోయాడు. అలా చూస్తోందిగానీ ఆపైనించి కదలిరాలేదు. వాడు టాక్సీ యెక్కి వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయి ఒంటరిది. అలా యెంతసేపో సముద్రం వేపు చూస్తోంది. రావు దగ్గరలో వున్నట్లు అమె గుర్తించలేదు. నీలినీటిలో క్రుంగిన సూర్యుడు యెరుపుఛాయనింకా ఆకాశంమీద వెదజల్లుతున్నాడు. ఎర్రని పక్షులు యెగురుతున్నట్లు కదులుతున్న మేఘాలు రానురాను యేకమై యెడారిలా మారిపోయాయి.

ఆ యెడారిని చూడలేక కామోసు అమ్మాయి యిటు ముఖం తిప్పింది. ఆ కళ్ళలో నీరు కదలుతోంది.

"ఈ ప్రదేశం మీకు నచ్చలేదా?" కాస్త దగ్గరగా జరిగి చనువు తీసుకుని రావు ప్రశ్నించాడు. అమె ఒకసారి అతని కళ్లల్లోనికి నిదానించి చూసింది. గోవా వచ్చాక తొలిసారి తన శరీరమంతా పులకరించింది. చిరునగవును పెదాలపై కదుపుతూ-

"ఎందుకు నచ్చలేదూ?" అంది.

రావు నవ్వుతూ "ఎందుకు నచ్చింది?" అని యెదురుప్రశ్న వేశాడు.

"ముఖ్య కారణం మా అమ్మకు పోర్చుగీసు భాష వచ్చేది. నన్ను డోనా అని పిల్చేది - అది గౌరవమైన పదమట..."

"నీ అసలు పేరు?"

"పమేలా."

"మీ పేరు డోనా పమేలా? లేక డోనా పౌలా? రెండు పేర్లు యించుమించు సరిపోయాయి" అన్నాడు.

అమె నవ్విన మరుక్షణంలోనే ప్రక్కనేవున్న మర్రిచెట్టుమీద కుప్పలుగా చేరిన కాకుల అరుపులు వినిపించాయి. అటువేపు తిరిగి నిదానంగా చూసి గబగబ తిరుగుముఖం పట్టింది. అలా చూస్తుండగానే బోటు క్లబ్ దాటి, బీచివేపు టూరిస్టు కాటేజెస్ దాటి సముద్రతీరంలో యిసుకపై కూలబడిపోయింది. రావు అటువేపే వెళ్లాడు. వెండిల్లా యిసుక మెరిసిపోతోంది. ఆ యిసుకపై వయ్యారమంతా వదిలేసి

ప్రక్కగా చారబడి వుంది. రావును చూడగానే–

"అందరూ నావేపు వింత పశువును చూసినట్లు చూసారు. మీరే దగ్గరగా వచ్చి నా గురించి అడిగి తెలుసుకున్నారు. అంత పెద్దమనిషికి చెప్పకా చెయ్యకా వచ్చేసాను, క్షమించండి" అంది. ఇంత పెద్ద సంజాయిషీ విన్నాక రావు మనసులో ముక్కోటి కోరికలు వూగినాయి.

"కాకుల అరుపులనే భరించలేరా? అంత సున్నితమా?"

"ఆ చెట్టుపై పామును చూడలేదూ? పామంటే నాకెంత భయమో?"

"ఏం?"

అమె జవాబు చెప్పలేదు. పడమట ఆకాశపుటెడారి బీటలు దేరిన నల్లరేగడిలా మారుతోంది. అటువేపే చూస్తూ–

"ఒంటరిగా యెందుకొచ్చారు?" అంది డోనా.

"నీవు దేనికి వెతుక్కుంటూ గోవా వచ్చావో గానీ – నేను మాత్రం నా జోడీని యెంచుకోడానికే యిక్కడకు వచ్చాను" అన్నాడు.

అటు తిరిగిన డోనా యిటు చప్పున తిరిగి అతని కళ్ళల్లోనికి చూస్తూ నవ్వింది. అప్పుడే యెదరగా లంగరు వేసుకున్న ఓడల దీపాల తోరణాలు ఒక్కసారి వెలిగాయి. మార్మగోవా పోర్టురు యెత్తయిన దీపస్తంభాలు యిరువేపులా చూస్తున్నాయి.

ఇక్కడ గులాబులు వారం రోజులైనా రెక్కలు రాల్చవు. ఈ అమ్మాయి వెన్నెల్లో నారింజరంగు గులాబిలా వుంది. ఆమెకు దగ్గరగా చేరాడు. వెన్నెల దువ్వుతున్న కెరటాలు వీళ్ల దగ్గరగా వచ్చి పోతున్నాయి. అతని మనసూ ఆ కెరటాల్లా ముందూ వెనకా అవుతోంది. ఆమె మాటల్లో యింకా యేదో భయం. "ఆ భయం ఆ పాము రూపంలో ఆమెకు కనిపించి వుండవచ్చు. అసలు ఆ చెట్టుపై పాము లేక పోయిండాలి" అనుకున్నాడు.

"ఆ కెరటాలు పాముల్లా ఒడ్డుకు చేరటం లేదూ?" అంది డోనా.

"అలా అనుకుంటే యీ ప్రదేశంలో వుండలేరు."

ఆమె చప్పున లేచి కూర్చొని మరీ దగ్గరగా వచ్చింది. ఆ మాటల్లో శోకం వూరిపోతోంది.

"నన్నేం చెయ్యమంటారు? నాకు అన్నీ అనుమానాలే. నా పుట్టుకతో యీ భయం రాలేదు. మా అమ్మ అంత వేగిరం యెందుకు చచ్చిపోవాలి? మా నాన్న నా కళ్ళ యెదరగా ముగ్గురు తల్లులను మార్చాడు. కామ కలపాలు నా కళ్ల యెదరగా సాగించాడు. ప్రేమతో పుట్టాను గానీ ప్రేమతో పెరగలేదు. ప్రేమించ గలిగే సాహసంతో పరుగెత్తుకొచ్చాను." ఇంకా ఆవేశంతో "నేను వచ్చిన దగ్గరనించీ చూస్తున్నాను. ఈ దేశం వాళ్లంతా మమ్మల్ని వెలివేసినట్లు చూస్తున్నారు. మేం దేశం పవిత్రతని కాల్చేస్తున్నామట! మేం అఖ్ఖర్లేదు. మా డబ్బు కావాలి. చూడండి, నేను తీసుకున్న ఆ కాటేజీ చూడండి. అందులో ఒక రోజు గడపడానికి నా దగ్గర రోజుకి రూ॥ 350 అద్దె తీసుకుంటున్నారు. ఏ విషయాల్లో మేం విసిగెత్తి వదలుకోలేక పోతున్నామో దానిగురించే మీరు ప్రాకులాడుతున్నారు. ఈ దేశంలో మానవత్వం వుందంటె వచ్చాను. ఇక్కడ అడవిజంతువుల్ని చూడ్డానికి కాదు, అంది."

ఆమె ఆవేశం ఆకాశం వరకూ ప్రాకిందేమో పడమటి నల్లమేఘాలు బరువెక్కి మెల్లగా యిటువేపు మెరుపుల్ని అండగా చేసుకుని కదిలాయి. గబగబ నాలుగు జల్లులు పడగానే రావు లేచిపోబోతుంటే ఆమె చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టి ఆ ఖద్దరు గుడ్డలు కాస్త యెత్తుకుని వర్షంలో తడుస్తూ చల్లబడుతూ–

"వర్షం... వర్షం... నాకు వర్షం అంటే యెంతో యిష్టం. తల్లిలాంటిదీ వర్షం, అంది."

ఆమె తడిచిన బట్టలమీద వెన్నెల నాట్యం చూసి ఆమెను లేవనెత్తాడు. తన చేతిని ఆమె నడుము చుట్టూ కదిపి బొడ్డుమీద వ్రేళ్లను మోపాడు. మెల్లగా అలానే యిద్దరూ ఆ కాటేజీ వేపు తడుచుకుంటూ నడిచారు. లోనికి వెళ్లాక తనే తలుపు బిగించాడు. ఆమె ఒక పేకెట్‌లో సిగరెట్ తీసి వెలిగించింది. "ఇది మీకు వద్దు" అంటూ యింకో పేకెట్‌లో సిగరెట్ అతనికి అందిచ్చింది. ముందు వెలిగిన అగ్గిపుల్ల అతనికి చూపించి తరవాత తను సిగరెట్ వెలిగించింది. సిగరెట్ తాగుతూనే బాత్‌రూమ్‌కు వెళ్లి తడిబట్టలు మార్చేసి తెల్లని చెడ్డీ పల్చని మజ్లిన్ గౌను వేసుకుని వచ్చి కుర్చీలో కూర్చుంది. ఆ తొడలనించి పాదాల వ్రేళ్ళ చివరవరకు అంటిపెట్టుకున్న అందాన్ని చూస్తూ రావు ఆమె యిచ్చిన ఆడ పైజామా వేసుకుని తన టెర్లిన్ దుస్తులను ఆరవేసుకున్నాడు.

"అక్టోబరు వచ్చినా యింకా వర్షం తగ్గడానికి యిష్టపడటం లేదు" అన్నాడు.

ఆమె యేమీ మాటాడంలేదు. సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తోంది. ఇద్దరూ ఆకలిని మరచిపోయారు.

రావు యెదరగా యీ కుందనపు బొమ్మను చూసి యింకో ఆకలితో సతమత మవుతున్నాడు. అతను దగ్గరగా జరిగి ఆమె వేపు చూస్తుంటే చప్పున ఆమె నోరు పెగిలింది.

"మీ పేరు?"

"రావు."

"రావ్ – నాకు పశువుగా బతకాలని లేదు. నాలో కామంతోపాటు విశ్వాసం వుంది. భక్తి వుంది. ఇవన్నీ కలిసిన ఆడదాన్ని నేను. ఒక పూలహారాన్ని. ఈ పూలహారాన్ని కనపడని దేవుడి మెడలో వెయ్యటం నాకు యిష్టంలేదు. నా లోటుపాట్లను క్షమించి నన్ను లాలించి ప్రేమించే మగాడి మెడలో వెయ్యాలని – వెతుక్కుంటూ యీ దేశం వచ్చాను రావ్..."

చప్పున మౌనం. ఆ కళ్లనించి ఆవేశం సృష్టించిన ముత్యాలు రాలాయి. మళ్లీ సిగరెట్ ముట్టించింది. ఈసారి ఆ కళ్లు అతనివేపు చూస్తున్నా నిద్రమత్తు కళ్లులా వున్నాయి. కానీ మిగతా అవయవాలేవీ నిద్రపోలేదు. రానురాను వాటిని నిర్లక్ష్యంగా వదిలేస్తూ జోగుతూ రావు దగ్గరగా వచ్చి అతనిని లేవనెత్తి పరుపుమీద కుదేస్తూ–

"ఇద్దరూ యేకంగా వుండటం ఒక పవిత్ర బంధంగా యెంచుకునే దేశంలో పుట్టిన మీరు నన్ను ముట్టుకుని నాలో ఆశను రెకెత్తించారు. నా గుండెల్లోనికి చూస్తున్నారు. మీరు మామ్మూలు మనిషి కారు. మీరొక్కరే అసలైన గురువు నాకు. నన్ను భరించి ప్రేమించే సత్తువ మీ ఒక్కరిలోనే వుంది. నా ఆఖరి ఆశ నన్ను

మీరు మభ్యపరిస్తే - మోసం చేస్తే నేను బ్రతకలేను. మీ విశాలమైన చేతులతో నన్ను లాలించి పాలించండి. నేను జీవించినంతకాలం నన్ను వదలిపెట్టకండి. నాకు శాంతిని ప్రసాదించండి. ఈ శాంతితో నాకున్న వలపు, తెలివితేటలు, శృంగారం, నా అన్ని సంపదలూ - అంతా నీ పరం చేస్తాను. మీ అనుంగు భార్యగా నమ్మకంగా బ్రతుకుతాను. మన పిల్లలకు తల్లిగా - ఇంకా - ఇంకా..."

అలా మాటాడుతూనే వుంది. కొంతసేపటికి లైటు డిమ్ అయ్యింది గానీ ఆమె విప్పిన అందం యింకా తేజంతో వెలుగుతోంది. బయట వెలుగుతున్న వెన్నెలతో ఆమె శరీరఛాయ పోటీ పడుతోంది. చందమామే అతని చేతికి దొరికిపోయింది. అర్ధరాత్రి - రావుకు గోవాలో కోవా దొరికింది. ఆమెను అందమైన గులాబిలా చూడలేదు. ఒక పశువు అనుకుని నలిపివేశాడు.

అక్టోబరు వేడి వెన్నెల్లో తడిచి చల్లబడి చలిగాలి వీచింది. చుట్టూ సముద్రరోదన తప్పించి యింకేమీ వినపడలేదు. ప్రకృతికన్నా నగ్నంగా ఆమె పడివుంది. ఆమెను అలసట, తాగిన సిగరెట్‌లోని మత్తూ రెండూ కలిసి శవంలా నిద్దరపుచ్చాయి. రక్తం తాగిన పులి పారిపోయింది.

మరుసటి రోజు టూరిస్టు బస్సు పదిగంటలకల్లా డోనా పాలా బోటుక్లబ్బు ముందు ఆగింది. గైడు వివిధ రాష్ట్రాలు, దేశాలనించి వచ్చిన యాత్రికులందరినీ జెట్టీ దగ్గర నిల్చోబెట్టి అరుస్తున్నాడు:

"ఈ చక్కని ప్రదేశం పేరు డోనా పాలా. ఈ పేరెందుకొచ్చిందో తెలుసా? డోనా పవులా ఒక పోర్చుగీసు గవర్నరు కూతురు. ఆమె ఒక మామూలు సిపాయిని మనసారా ప్రేమించింది. తండ్రి తెలుసుకున్నాడు. కోపంతో ఆ సిపాయిని తిరిగి పోర్చుగల్‌కు పంపేసాడు. అతనికోసం యెదురుచూసి చూసి పాపం, ఆ ప్రేమికురాలు యిదిగో, యిక్కడే సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుంది."

ఆ గుట్టమీద స్తంభాల మహల్ దగ్గర నిల్చున్న ఒక యువకుడు అంతలో అరిచాడు: "ఏయ్, అదేదో శవంలా వుంది!"

దుర్భిణీతో వున్న ఒక టూరిస్టు గబగబ సముద్రంలోనికి చూసి-

"చక్కని యువతి శవం" అన్నాడు.

టూరిస్టు కాటేజిలోని డ్రెస్సింగ్ టేబిల్ అరలో పోలీసులకు ఒక చీటీ దొరికింది.

"ఈ పశు ప్రపంచంలో నాకు యింక బతకాలని యిష్టంలేక - డోనా."

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, డిసెంబరు 1979)

* * *